# ఆచార్య ప్రభువుడు

"హలో మిష్టర్ మదన్‌మోహన్, ఏ మానందము భూమీ తల మున!"

ఎదురుగా రెండు చేతులతో షేక్‌హాండ్ ఇవ్వడానికి సంసిద్ధ పడుతున్నాడు వీరాస్వామి.

చప్పున పోల్చుకున్నాడు మదనమోహన్.

అరెరెరెరే.... అని ధ్వనులు చేస్తున్నాడు ఆనందాన్ని ఆశ్చర్యంగా వ్యక్తం చేసే దొడ్డ ప్రయత్నం చేస్తున్నట్లు మోహన్. "ఎప్పుడొచ్చావ్? ఎక్కడికి వెళుతున్నావ్? ఇక్కడ నేను చచ్చానన్న విషయం కూడా తెలీదా? హఠాత్తుగా ఇలా కలుసుకోకపోతే ప్రొఫెసర్‌గారు మా ఊరు పావనం చేశారన్న సంగతి కూడా మాకు తెలిసేదే కాదు" అని నిష్ఠూరమాడుతున్నాడు వీరాస్వామి.

అతడి పక్కనే అతడి స్నేహితుడెవరో తెల్లబోయి చూస్తున్నాడు. మొహమంతా చాటలాగా చేసుకున్నాడు - తనకి కూడా ఏదో సన్మానం జరిగినట్టూ, జరగబోతున్నట్టూ, లేక తన ప్రొఫెసరే తనకు తాను తారసపడ్డట్టు.

"సారీ బ్రదర్!"

"ఎప్పుడూ వున్నదేగా, రోజుకు నలభై నాలుగు సారీలు చెప్పడం. ఇప్పుడేమన్నా కొత్త గనకనా? అయితే ఇంకా నీలో ఏమీ మార్పు రాలేదన్నమాట!"

"ఇవాళ ఇక్కడ పిహెచ్.డి. 'వైవా'వుండి వచ్చాను. అక్కడ అర్జంటుగా పనులేవో వున్నాయి. అందువల్ల సాయంత్రమే బయలుదేరి

వెళుతున్నాను, ఏమీ అనుకోకు. మళ్ళీవస్తాను కదా!" అని అనునయంగా చెపుతున్నాడు మోహన్. "ఏమనుకుంటే ఏం ప్రయోజనంలే! సరేలే ఇదీ ఒకందుకు మంచిదే. మా ఆవిడ కాకినాడ వెళ్ళింది. మాఇంటికి వచ్చినా మనిద్దరం మళ్ళీ ఊరిమీద పడాల్సివచ్చేది. పోనీ, ఈసారి మాత్రం తప్పకుండా రావాలి. రాకపోయినావో! అసలు నువ్వొస్తున్న సంగతి నాకు రాయడం న్యాయంకదా? రాయకపోగా ఇక్కడ వచ్చిం తర్వాతైనా నా గురించి వాకబు చేయలేదు. అదీనా కోపం. హైదరా బాదేనా?! ఎంతమంది పిల్లలు? క్వార్టర్స్‌లో వుంటున్నావా?" అంటూ ప్రశ్నలు గుప్పించాడు వీరాస్వామి.

"నలుగురా! ఫామిలీ ప్లానింగ్ పూర్వపు రోజులవాడివి కదా మరి!"

గుంటూరు ఆర్టీసీ బస్సుస్టాండు. సాయం సంధ్య, అందంగా వుంది, జనసమ్మర్దం అంతగా లేదు. ప్రశాంతంగా వుంది. ఆవరణంతా ఊడ్చి నీళ్ళు చల్లినట్లున్నది. అంతకు ముందే లైట్లన్నీ వెలిగాయి. దూరంగా అరటిపళ్ళ గెలల,చిత్రవర్ణాల ముఖ చిత్రాల పత్రికలు కిళ్ళీ బడ్డీలలోంచి కనబడుతున్నాయి.

"మీట్ మై ఫ్రెండ్ మిస్టర్ శ్యామసుందర్!" అని అప్పటికి గుర్తొచ్చినట్లుగా తన స్నేహితుణ్ణి పరిచయం చేశాడు వీరాస్వామి.

అన్యోన్య గౌరవ ప్రకటనం జరిగిపోయింది. వీరాస్వామి అడి గిన కుశల ప్రశ్నలన్నింటికీ మదనమోహన్ సమాధానాలు చెప్పాడు.

వీరాస్వామి శ్యామసుందర్‌కి చెపుతున్నాడు: "యూనివర్శిటీలో నా బెస్ట్ ఫ్రెండ్ మోహన్. బాగా పాడేవాడు. నాటకాల్లో వేషాలు వేసే వాడు. ఇక చెప్పాల్నా? చదివేది తెలుగానర్సాయె! విట్టులు, చమత్కా రాలు, జోకులు, పద్యాలు, శృంగారం.... మా మతులు పోగొట్టేసే వాడనుకో! ఏరా మోహన్, ఇంకా ఏమైనా ఆ వేషాలున్నాయా?"

మోహన్ ఇబ్బందిగా నవ్వాడు.

"ఈ కండక్టరెక్కడకు పోయాడో, ఏంపాడో. కౌంటర్‌లో కనుక్కుంటే ఇస్యూయింగ్ అయిపోయిందంటారు. అర్జంటుగా ఒక టికెట్ కావాలిరా. దొరక్కపోయిందా బలవంతాన నీ ప్రయాణం ఆపించేస్తాను."

శ్యాంసుందర్ హాయిగా నవ్వాడు.

"బాబ్బాబు, అంత పని చెయ్యకు. రేపక్కడ నాకు ఎగ్జామినర్స్ మీటింగుంది. నీ పుణ్యం. అందుకనే ఇక్కడకు వచ్చేముందే రిజర్వు చేయించాల్సిందని రాశాను."

"ఒకవేళ బందో, పాడో వచ్చి బస్సులు నడవకపోతే ఏం చేసేవాడివోయ్? బడాయిలు పలక్కు. నీవుండిపో-మా ఫ్రెండ్ సిస్టర్ వెళ్ళి తీరాలి. రేపు కాలేజి ఓపెనింగ్ డే-తప్పదు. మేనేజ్ చేయలేకపోతామా అని గొప్పలు పోయినాం, ఇప్పుడేమో ఇబ్బంది వచ్చిపడింది."

"చాలా బస్సులున్నాయి కదా?" అన్నాడు మోహన్.

"ఉన్నాయి నిజమే, కాని ఈ బస్సుకి వస్తున్నట్లు వైరిచ్చాము. వాళ్ళ చెల్లి బస్సు స్టాండ్‌కి వస్తుంది. కంగారుపడిపోతారు. వెళ్ళి చూసొద్దాం రాండి, కండక్టర్ ఎక్కడైనా కలుస్తాడేమో"నని శ్యామసుందర్ బరువుగా ముందుకడుగేశాడు. వీరాస్వామి అనుసరించాడు. మదనమోహన్ ఒక్కడే నిలుచుండిపోయాడు. బస్సులో రిజర్వు చేయించుకున్నవాళ్ళు పెట్టేబేడా సర్దుకుంటున్నారు. ఆ కార్నర్ సీటు తనకి వస్తే బాగుండేది. ఎవరో ముసలాయన ఆ సీటు తనకివ్వమంటే ససేమిరా వల్ల కాదన్నాడు. పై పెచ్చు కంగున దగ్గుతున్నాడు. రాత్రంతా తన మొహానే దగ్గుతాడు కాబోలు! మధ్య సీట్లో కూచుంటే ఏం పోయింది? ముసలాడుకదా! రాత్రిపూట ఆనుకోవడానికి సుఖంగా వుంటుందని కాబోలు! యిటు పక్కన ఎవరు కూచుంటారో! పోనీలే ఒక్క రాత్రికి ఎలాగో బాధపడాలి. ఐదయీ అవుతుండగానే ఇంకా చీకటి

వుండగానే తాను హైదరాబాదు చేరుకుంటాడు. కండక్టర్‌ను తమ మధ్యలో నడపించుకుంటూ కుడి యెడమల డాల్ కత్తులు మెరిపిస్తున్నట్లుగా వచ్చారు వాళ్ళు.

"ఒక్క సీటైతే వుంది కానీండి, అది ఆడాళ్ళ సీటుకాదు" అంటున్నాడు కండక్టర్.

"ఏదో సీటులే బాబూ ఉంటే చాలు. మరి స్టాడింగ్ ఒప్పుకోరు కాబట్టి కాని లేదా కొంతదూరం స్టాడింగ్‌లో రావడాకైనా సిద్ధమే" అంటున్నాడు శ్యామసుందర్.

"మగాళ్ళ పక్కన ఎలా కూచోబెడతానండీ ఆడకూతురిని?"

"అవన్నీ ఇప్పుడు చూసుకుంటే ఎట్లానయ్యా? మాకేం అభ్యంతరం లేదంటున్నాంగా, నీకెందుకా గొడవ!"

"గొడవో, గిడవో నాకేం తెలుస్తుంది బాబూ? మాకూ కొన్ని రూల్సూ, మంచీ సెబ్బరా ఉంటాయి. అదే మీతో మనవి సేత్తా వుండాను" అని తర్కిస్తున్నాడు కండక్టరు.

"ఆ సీటు నెంబరు చెప్పు వీరికి. నేను పోయి మా సిస్టర్‌ని వెంటబెట్టుకొస్తాను" అని వెళ్ళాడు శ్యామసుందర్.

పోనీ ఆ సీట్లోకి తాను మారిపోయి ఆ ముసలాడి పక్కన ఈవిడకి సీటిస్తే సరి అనుకున్నాడు మదనమోహన్.

"పధ్నాలుగో నంబరండీ!" అన్నాడు కండక్టర్.

ఉలిక్కిపడ్డాడు మదనమోహన్. తన పక్కసీటే అది.

తను సీటు మార్చడం సాధ్యంకాదు.

ఇంతలో వాళ్ళిద్దరూ వచ్చేశారు.

ప్రొఫెసర్ మదనమోహన్ అని పరిచయం చేశాడు శ్యామసుందర్. మోహన్ చేతులు జోడించాడు.

"మా చెల్లెలండీ, మణిమాల- ఫిజిక్సు లెక్చెరర్. ఇవాళ మీతో హైదరాబాద్ దాకా వస్తోంది" అని చెపుతున్నాడు శ్యామసుందర్.

కండక్టర్ బస్సులో ఎక్కి బెల్లు మోగిస్తున్నాడు, నెంబ రెంత టండీ అని అడుగుతున్నాడు శ్యామసుందర్.

"ఓరి! నీ పక్క నెంబరేకదా. ఇకనేం,నిశ్చింత. రా అమ్మోరా, మణిమాలా! మనవాడేలే మదనమోహన్. మరేం ఇబ్బంది పడాలో అని బాధపడిపోతున్నాననుకో మనస్సులో. గుడ్, వెరీగుడ్!" అంటున్నాడు వీరాస్వామి. మణిమాల కూడా బస్సు ఎక్కింది. వాళ్ళన్నగారు చిన్న సూట్ కేస్ పట్టుకుని లోపలకు ఎక్కి అమర్చాడు.

"మీరు మధ్యలోకూచుంటారా?అని అడిగాడు మదనమోహన్."

"లేదండీ. ఈ కార్నరే బావుంటుంది" అని చెప్పి కూచుంది మణిమాల. ముసలాయనకూ, మణిమాలకూ మధ్యన కూచున్నాడు మదనమోహన్.

కండక్టర్ మళ్ళీ బెల్లు మోగించాడు.

ఆ సీటు మదనమోహన్ పక్కన దొరకడం తమ కుటుంబాని కంతా ఎంతో ఉపకారం చేసినట్లు, కళ్ళలో కృతజ్ఞతా భావాన్ని వెల్ల డిస్తూను, జాగ్రత్త సుమండీ అని అప్పగిస్తున్నట్లూ మోహన్‌వేపు చూసి దిగిపోయినాడు శ్యామసుందర్. వీరాస్వామి దిగిపోయాడు.

బస్సు హాయిగా కదిలింది. విండోలోంచి చూస్తే వీరాస్వామి, శ్యామసుందర్ ఇద్దరూ చేతులూపుతున్నారు. తానూ చేయి ఊపాడు. మణిమాల కూడా తన చేతి మీదుగా చేయి ఊపడంతో మదనమోహన్ చేతికి అడ్డం పడింది. బయట వాళ్ళిద్దరూ దూరమైపోయినారు. మసకై నారు. మరుగైనారు. చల్లనిగాలి విండోలోంచి వచ్చి పలకరించింది. మదనమోహన్‌కి చాలా కులాసా అనిపించింది. ముగ్గురికి సరిగా సరి పోయే సీటది. అదీకాక దగ్గు ముసలాయన కిందికి జారబడి కూచోడంతో తన వంతు చోటుకన్నా ఓ పిసరు దురాక్రమణమున్నూ చేశాడు.

ఇద్దరూ సజావుగా తక్కినచోటును తమది చేసుకోవాలి. అందులోనూ ఇద్దరి మధ్యన యిరుకున బడినట్లున్నది. అటు నుయ్యి, ఇటు గొయ్యి. ఛా ఛా గొయ్యి ఏమి? నున్నగా, చక్కగా దువ్వి, మధ్య పాపిటతీసి, పూల వాసన గుబాళించుచూ కొప్పెట్టి పక్కన నొక జవ్వని కూచొని వుండగా, ఏబై ఏళ్ళనాటి శైలి వస్తోందేమిటీ దీని దుంపతెగా. తాను ఏభైకి దగ్గర పడుతున్నాడన్న భవిష్యత్సూచనయా? నీ బొంద. నీకు ఏభై వచ్చాయని ఎవ్వడూ అనుకోడు. వస్తున్నట్టు కూడా కనుక్కోలేడు. ముప్పై ఆరేళ్ళంటే ఎవరైనా నమ్మేస్తారు. అన్నట్లు ఎవరు చెప్మా అన్నది? ఎక్కడో శ్లోకంలో చదివినట్లున్నది. కళా శాస్త్రంలో కాదుకదా! పద్దెనిమిది నుంచి ముప్పై ఎనిమిది వరకే మగవారియందు యౌవనముండునని - ఇవన్నీ చెత్త కబుర్లు. తాతగారి ముత్తాతగారి భావాలకి దాసులు చెప్పే మాటలు. తనకు నలభై దాటి ఆరేళ్ళయిన మాట నిజమే. అయితేనేం, క్లాసులో పాఠాలు చెప్పేటప్పుడు అదో రకంగా నర్మగర్భంగా, అలవోకగా, లీలగా, గోలగా అటువైపు చూస్తుంటే అమ్మాయిలు నవ్వుకోరా-లేనిసిగ్గు తెచ్చుకొని నటించరా - అసలు రహస్యమిదండీ! వాళ్ళకు మాత్రం ఇష్టం కాదా ఇలాటి కబుర్లు, సన్ని వేశాలు!

"ఏమండీ, మీ పేరు మణిమాల అన్నారు కదూ?"

అవునని కీరవాణియా-కీచుగొంతుయా అనుమానంగా చూసింది. రెప్పలల్లాడి నట్లనిపించింది- మరి అసలు ఇటువేపు చూసిందో, లేదో కాని.

"ఏం చెపుతారు మీరు?"

"ఫిజిక్సు." ఆహా! సొగసుగానేయున్నది కంఠమాధుర్యము.

"మీవారేం చేస్తారు?"

తెలీకనా? కావాలనే అడిగాడు. ఏమంటే, లోకజ్ఞత ముఖ్యం ఆచార్యుడన్నవాడికి. అందుకు.

ఆ పిల్ల నిబ్బరంగానే వుందికాని. ఈ పక్క కూచున్నాడే ప్రొఫెసరు- వీడికి దుఃఖం లాంటి సిగ్గూ, సిగ్గులాంటి దుఃఖమూ ఆమె తలవంచుకోవడంలో కనపడింది.

"మేరేజింకా చేసుకోలేదండీ!"

వహ్వా. నిన్ను చేసుకోలేదా. నువు చేసుకోలేదా. దుర్యోధనుడు కాడేమో! శకుని అడిగి వుంటాడు. నిన్నోడి తన్నోడెనా - తన్నోడి నిన్నోడెనా? ఏమిటిది, పొద్దున్న "వైవా"లో కన్నా బుద్ధి బహు చమత్కార భాసురంగా పనిచేస్తున్నది? అక్కడ పనిచేయడానికేముంది? చదివినా చదవకపోయినా ఇవ్వచ్చు. కాని, ఇక్కడ ఈ కోమలి హృదయభారమును చదువుటయే గదా పాండిత్యము, ప్రజ్ఞ, అని హృదయం ఉవ్విళ్ళూరుతోంది మదనమోహన్‌కి.

"ఏమండీ,పన్నెండొందలు తెచ్చుకుంటారు కదా? ఇంకా మేరేజ్ చేసుకోలేదూ? సెటిల్ అయినారుగా ఉద్యోగంలో. ఆహా! ఏమిటిలా అధిక ప్రసంగం చేస్తాడు అనుకునేరు. నాకు చిన్నప్పటినుంచీ కొంచెం మాటకారితనం వుంది లెండి!"

"అదేం కాదండీ, ఏవిటో సీరియస్‌గా ఆలోచించలేదు" అన్నది మణిమాల.

ఈవిడకోసం దిక్పాలకులూ, నలుడూ పోటీలుపడి వస్తారనుకొంటోంది కాబోలు. బాగానే వుందనుకో. ఎంతమంది బాగా లేరు. ఈ రోజుల్లో ముప్పై ఏళ్ళు నిండిన ముది కన్నెలు ఎందరోవున్నారు ఎక్కడబడితే అక్కడ. కట్నాలా? ఈ మణిమాల ఒక్క సంవత్సరం జీతంతో బోల్డు కట్నం ఇవ్వవచ్చునే? ఏమైనా ప్రేమకథేమో - ప్రేమి

కుడు మోసం చేశాడా లేక ప్రేమికురాలే వంచించి యుండనోపునో! ఎవరినైనా పెద్ద ప్రొఫెసర్‌ని, ఐ.ఏ.ఎస్ ఆఫీసరుని కాంక్షించుచుండెనా లలనా మణిమాల!

ముసలాయన్ను తాను అనవసరంగా అనుమానించి, అవమానించి మనసులో తిట్టుకున్నాడు కాని నిజంగా మంచివాడు. పురుషులందు పుణ్యపురుషులు వేరయా - దగ్గునట్టి ముసలివారు మంచివారయా - సీటులో కిందికి కిందికి జారుతున్నాడు. ఒత్తిడి కలిగిస్తున్నాడు. తత్ఫలితంగా తానిటు వొరిగిపోవాల్సి వస్తున్నది. భుజం భుజం కలుపుదాం - అని మనసు డ్యూయెటు పాడేస్తున్నది. మణిమాలకూడా ఏమీ అనుకోవడంలేదు. ఏమనుకుంటుంది? ఇంకా అటు జరిగితే పాసింజర్ల కాలి బాటలో పడిపోవాల్సిందే. భుజం భుజం గట్టిగా అదిమినా వొప్పుకుందే. ఏమీ అనటంలేదే!

"ఎక్కడుంటారండీ హైగ్ లో."

"ప్రకాశంనగర్."

"ప్రకాశంనగరే? మా ఇల్లు కూడా అటువేపేలెండి. ఎప్పుడైనా వస్తాను మీ ఇంటికి."

"ఓ! రాండి. వచ్చేవారం మా అన్నయ్య కూడా వస్తాడు. ఇక్కడ ఇంటర్వ్యూ వుంది. కెమికలింజనీరింగ్ ఫస్టన ప్యాసైనాడా, ఇంకా ఉద్యోగం లేదు. వీరాస్వామిగారు మంచివారు."

[మహా అక్కడికి నేనే మంచివాడిని కానట్టు.]

ప్రకాశం బ్యారేజ్ మీద చల్లని గాలి లోపలికి దూసుకొని వచ్చి హాయ్ మనిపించింది. మెర్క్యురీ దీపాల కాంతి దోబూచులాడిపోతోంది, మధ్య మధ్య మొహాలమీదపడి పలకరిస్తూ.

ఇందాక చూడలేదు. బెజవాడలో ఇద్దరి ముగ్గురిని ఎక్కించాడు కండక్టర్. గుంటూరులోనేమో ఒక్క సీటుకూడా లేదని పేచీపెట్టాడు. తను పట్టించుకోలేదు.వాళ్ళు ప్రాధేయపడ్డారు.నందిగామలో దిగిపోతారు. తిరుపతి నుంచి వస్తున్నారు. ఇద్దరు చిన్న చిన్న పిల్లలు తిరుపతి గుర్తులతో ఉన్నారు. వాళ్ళమ్మ కాబోలు-ఆమే అలానే ఉంది. వాళ్ళ నాన్నగారు కాబోలు, నిలుచుని నిద్రపోతున్న పిల్లల్ని బెదిరిస్తున్నాడు.

మణిమాల ఒక పాపను పిలిచి తన వొళ్ళో కూచోపెట్టుకుంది.

చ్చు చ్చు చ్చు చ్చొ చ్చొ చ్చో తానేనా వెనకబడిపోయేది? పెద్దపిల్లకి తొమ్మిదేళ్ళుంటాయేమో - లావుగా, బలంగా, పుష్టిగా వుంది. "రా పాపా, రా" అని తన పక్కన సీటు చూపించాడు. ముసలాయన విసుక్కున్నాడు.ఆ విసుగును లక్ష్యపెట్టలేదు. నిలుచోలేకపోతోందేమో, ఆ పిల్ల వచ్చి కూచుంది. మరింత ఇరకాటమైపోయింది సీటులో. మరింత అతుక్కొనిపోయినాడు మణిమాలకు ప్రొఫెసర్‌గారు.

బస్సులో లైట్లన్నీ ఆరిపోయినయ్. రివ్వున పోతోంది. రోడ్డు సాఫీగా, సవ్యంగానే వుందికదా - మరెందుకిన్ని ఊపులు? తన చెయ్యి ఎక్కడ పెట్టుకోవాలో తెలీటంలేదు. చోటులేదు.తోచటంలేదు.మణిమాల వొళ్ళోవున్న పిల్ల తన వొళ్ళోకి వొరిగి నిద్రపోతోంది.

మదనమోహన్‌కి తన శరీరం తన స్వాధీనంలో లేదు. సీటు పైఅంచు మీదుగా చేయి చాచాడు. మణిమాల అవతలి భుజంపైన ఆ చేయివాలిపోతోంది.

"సరిగా కూచోండి. ఇంకా ఎక్కడికి జరగ్గలరు పాపం! మీకు చాలా ఇన్‌కన్వీనియన్స్‌గా వుందికదూ? నందిగామలో వీళ్ళు దిగిపోయిం తర్వాత ఇంత అవస్థ వుండదు లెండి! అయ్యో పాపం, ఇటు కాస్త జరగండి. నాకేం ఇబ్బందిలేదు, అయామ్ వోకే. ఆలురైటూ కొంచెం ఇటు జరగండి లేదా వొరగండి."

ఊః ఊః అంటుంది కాని, ఏమీ అనదేమిటి? ఒరగదేమిటి! అని ఊః ఇదై పోతున్నాడు ప్రొఫెసర్. చీకటి దీని దుంపతెగ. పాడు చీకటి. మంచి చీకటి. హాయి చీకటి. ఈ పిల్ల ఒకటి, ఇటువైపు మరొకటి. ఇటువైపు ఆమె కటి. ఆహా. కవిత్వం వచ్చేస్తున్నదే-నిరుపహతి స్థలం అంటే ఇలాంటిదే కాబోలు!

"అబ్బ, చెమటపోస్తుందేమిటి?ఏమండీ,పడిపోతున్నారా ఏమిటి? అటు వొరుగుతారు" నాన్నా నాన్నా అని కలవరిస్తోంది మణిమాల వొళ్ళో వున్న చిన్నపిల్ల. మణిమాల లోపల ఏమనుకుంటున్నదో— తన పిల్లలకి నాన్న ఎక్కడున్నాడో అని ఆలోచిస్తున్నదేమో! ముప్ఫై రెండో, ముప్ఫైమూడో ఏళ్ళువుంటాయి. ముదిపాప చిహ్నాలేవీ లేవు కాని ఎన్నాళ్ళు? ఎన్నాళ్ళీ ఇహ సుఖములలో కొన్నాళ్ళేకదా మనసా?

నందిగామ వచ్చింది. తిరుపతి నుంచి తట్టాబుట్టా వాళ్ళు. "అమ్మా దండాలు, అయ్యా దండాలు" అని దిగిపోయినారు.

"కాస్త కాఫీ పట్టుకొస్తానండీ!"

"ఎందుకండీ మీకు శ్రమ?"

ఎంతమాట (అని లోపల అనుకొని) "ఇప్పుడేవస్తా. అరటిపండు ఇవ్వబోతే తీసుకోలేదు, కాఫీ మాత్రం తీసుకుంది వద్దువద్దంటూనే, ఇక తప్పదు బాబూ అన్నట్లుగా. కిల్లీ వేశాడు. ఎందుకు కొన్నట్లు, పూలు! రాత్రి పదిగంటల వేళ. ఇంటికి పోయేసరికి ఎలాగూ వాడిపోతాయికదా? మణిమాల కిద్దామనా, ఏమో ఏమీ తోచటంలేదు.

ముసలాయన మధ్య సీట్లోకి వచ్చాడు. "కావలిస్తే మీరే అటు కూచోండి. బుర్ర కొట్టుకొంటోంది అద్దానికి."

"ఇదొకటా, జరగండి జరగండి."

మళ్ళీ బస్సు రయ్యిన దూసుకొని పోతోంది. కంటిమీద కునుకు లేదు. కళ్ళు తెరిచినా, మూసినా చీకటి, చీకటి. ఆవిడ భుజంమీద చెయ్యి అలానే వుంది. ఆవిడ నిద్ర ఎలా పోగలుగుతోంది? అది కపట నిద్రా, దొంగనిద్రా, నిజమైన నిద్రేనా!

తాను సైకాలజీ చదువుకొని వుంటే బావుండేది. ఇటువంటి సమయాల్లో ఎలా ప్రవర్తించాలో తెలిసివుండేది.

"నమస్కారమండీ- వొస్తా" అని సూట్ కేస్ పట్టుకొని వుంది, ఉలిక్కిపడి మదనమోహన్ కళ్ళు తెరిచేసరికి.

"నువ్వొట్టి వెధవ్వి!" అన్నట్లు వినిపించాయా మాటలతడికి. కాని అతడికి అనుమానం- తాను వెధవేనా అని! ఎందుకని? బస్సుదిగి ఇంటికి వెళ్ళిందాకా అర్థంకాలేదు.

(ఆంధ్రజ్యోతి వార పత్రిక - 1982)